

పురజనుల కోరిక మీద, రామభద్రయ్యగారు కొడుకులచేత సత్యనారాయణ వ్రతం, బీదలకు అన్నదానం చేయించనిశ్చయించుకున్నారు. ఆ ప్రకారం ఆహ్వాన పత్రాలు అచ్చు వేయించి, బంధుమిత్రులకు పంపటం జరిగింది.

గుండమ్మ కొడుకు ప్రభాకర్ ఆహ్వానం అందుకుని బయలుదేరబోతుండగా, గంటయ్య 'తనకూ ఆహ్వానం వచ్చిందనీ (రాకపోయినా), ఒక్కడ్నే పంపోను అని ఆలోచిస్తున్నాననీ, సరే, మీరు బయలుదేరుతున్నారుగాబట్టి, మీకు తోడు నేనూ వస్తా'నని ప్రభాకర్ వెంట పెట్టే, బెడ్డూ తీసుకుని బయలుదేరాడు.

*   *   *

రామభద్రయ్యగారి ఇంట్లో గుండమ్మ సత్యనారాయణ వ్రత సన్నాహాలన్నీ నెత్తిన వేసుకుని అల్లుళ్ళ దగ్గరనుంచి కూతుళ్ళ వరకూ అదుపు చేస్తూ, పనివాళ్ళని ఆజ్ఞాపిస్తూ, వెనకటిలాగే పెత్తనం చలాయిస్తూ ఉంది. ఈ పద్ధతి చిన్న కూతురు సరోజకు నచ్చలేదు. 'అసలు నువ్వెందు కింత పూసుకుంటావు' తో మొదలుపెట్టి–'సొంత యింట్లో సాగక పరాయి యింట్లో చెలాయిస్తుంది

చక్రపాణి

పెత్తనం' అనేదాకా తల్లిని సూటి పోటీగా అన్నది. గుండమ్మ చిన్న కూతురులోలికి ఆట్టే పోకుండా, చూచీ చూడనట్టు వదలి, పెద్దకూతురు ఇంటి కొచ్చిన చుట్టపక్కాలు ప్రాముఖ్యతని గ్రహించే విధంగా ప్రవర్తించి, సత్య నారాయణవ్రతం, అన్నదానం వగైరాలు నిర్విఘ్నంగా నెరవేర్చింది.

* * *

వచ్చిన చుట్టాలు ఒక్కొక్కళ్ళే వెళ్లిపోయారు. గంటయ్య మాత్రం కదలలేదు.

ప్రభాకర్, పద్మ అందరివద్ద సెలవు తీసుకుని ప్రయాణమై, అమ్మదగ్గర కొచ్చి 'అమ్మా, రా, మనింటికి పోదాం' అని పిలిస్తే, గుండమ్మ 'నేను రాను, నా కిక్కడే బాగుంది' అంటుంది. చిన్నకూతురు అందుకుని 'అవును, ఎందు కొస్తుంది; అక్కడెవరున్నారు — చలాయించడానికి పెత్తనం?' అని పుటుక్కున అన్నది. పెద్దకూతురు లక్ష్మి 'అవేంమాటలే' అని చెల్లెల్ని వారించగా -సరోజ 'నీకు తెలీదు, నువూరుకో అక్కా! ఇంకా 'మనం చిన్నపిల్లల మనే అనుకూంటూ ఉంది. మనం ఏమి తినాలో, ఏం కట్టుకోవాలో అన్నింటికీ ఈమే చెప్పాలి; ఎన్నాళ్లీ నస!' అని కుండ పగలగొట్టినట్టు అనేసింది. దాంతో గుండమ్మ సంగతంతా గ్రహించుకుని, మూటా ముల్లే కట్టుకుని, పెద్ద కూతురు వద్దన్నా వినిపించుకోకుండా కొడుకూ

కోడలితో బయలుదేరింది. క్రింద అల్లుళ్లకీ, రామభద్రయ్యగారికి నమస్కారాలు చెప్పి, అల్లుళ్ళు ఎంత బతిమాలినా వినకుండా వెళ్ళిపోయింది.

తరువాత రామభద్రయ్యగారు అంతా విచారించి సంగతి తెలుసుకున్నాడు. కాని యీ విషయంలో కొడుకులు భార్యలవైపే మొగ్గటం చూచి—'భార్యలమీద ప్రేమ ఉండవలసిందే గాని, వాళ్లను తగు స్థానంలోనే ఉంచాలి. నెత్తి కెక్కించుకోగూడదు'అని పరోక్షంగా హెచ్చరించి, తను మకాం తోట బంగళాలోకి మార్చడానికి నిశ్చయించుకున్నా నని చెబుతాడు.

కొడుకులు దీనికి ఒప్పుకోరు. కాని, రామభద్రయ్య ప్రపంచధర్మం చెబుతాడు. 'ఎదిగిన కొడుకులు చీటికి మాటికి సలహాలు అడగడం, తండ్రి చెప్పడం అంత మంచిదికా దనీ, ఐనా చిక్కు సమస్య లేమైనా వస్తే, తనని సంప్రదించవచ్చు' ననీ వాళ్ళని ఒప్పించి, మకాం తోట బంగళాకి మారుస్తాడు.

* * *

గుండమ్మ ఇంటి ముఖద్వారంమీద 'నాట్య భారతి' బోర్డు వెలిసింది. ఇంట్లో భూపతి ఆధ్వర్యం క్రింద—తబలా వాయిద్యాలూ, నాట్యాలు జరుగుతున్నయ్. కొందరు నాట్యకత్తెలు శిక్షణ పొందుతున్నారు. ఇదంతా పద్మకు మొదట్లో యిష్టం లేక

పోయినా-'భారతదేశంలో పెళ్ళిళ్ళ వల్ల కళామతల్లికి ఎంతో అపచారం జరుగుతోం దనీ, నీలాంటి కళా తపస్వినుల కళా కౌశలం వివాహానికి ఆహుతి అయిపోగూడ దనీ' ప్రభాకర్ భార్యకు నచ్చజెప్పి, నాట్యకళను ఉద్ధరించడానికి కంకణం కట్టుకున్నాడు.

గుండమ్మ—కోరలు తీసిన పాము లాగ—మామూలు పెరటిఋుంట్లో పడి ఉంటున్నది!

* * *

గంటయ్య ఇంట్లోనే తిష్ట వేసి, ఇంటికి చిచ్చుపెట్టాడు. ఎలాగంటే ఒకనాడు సరోజనని డబ్బు అడిగాడు. 'నా దగ్గర లేదు. అక్కని అడగమంది. గంటయ్య నొచ్చుకుని 'అయ్యో! ఒకనాడు నీ చేతిమీదుగా ఎంతోడబ్బు ఖర్చు పెట్టినదానివి! యీ నాటికి—ఒక్క రూపాయి కోసం, అక్కని—ఆనాడు నీ చేతికింద బతికిన అక్కని—అడుక్కోవలసి వచ్చిందే' అని మొసలి కన్నీళ్ళతో సానుభూతి చూపాడు. సరోజకి ఒక్కసారిగా పాత జీవిత మంతా జ్ఞాపకం వస్తుంది. (Flash Back) అవును! గంటయ్య చెప్పింది ఆమెకి యదార్థంగానే కనిపించింది.

ఆ రాత్రి భర్తని 1000 రూపాయలు కావా లని అడిగింది. 'ఎందుకు?' అన్నాడు భర్త.

'ఎందుకో! అవన్నీ చెప్పాలా? నా చేతిలో ఆమాత్రం డబ్బు ఉండ గూడదా?' అన్నది సరోజ. 'అయితే-మీ అక్కగా! అడుగు' అని నవ్వి ఊరుకున్నాడు. సరోజ యిక మాట్లాడ లేదు. ఆ రాత్రి గోడవైపుకు తిరిగి పండుకుంది.

రాజా సంగతి గ్రహించాడు. మరునాడు అన్నని డబ్బు అడిగాడు. 'ఎందుకు?' అన్నాడు అన్న. రాజాకి నవ్వు వచ్చింది. 'ఎందుకు నవ్వుతావు' అని అడిగాడు అంజి. రాజా చెప్పాడు. అన్న లక్ష్మిని పిలిచి, 1000 కావా లన్నాడు. 'ఎందుకు?' అన్నది లక్ష్మి. అన్నదమ్ము లిద్దరూ ఒకళ్ళ మొఖం ఒకళ్ళు చూచుకుని నవ్వారు. లక్ష్మికి ఏమీ అర్థం కాక, పెళ్ళి డబ్బు తీసుకొస్తుంది. తమ్ముడికి ఇవ్వమంటాడు. ఎందు కన్నట్టు చూస్తుంది లక్ష్మి. రాజా అర్థం చేసుకుని, సంగతి చెపుతాడు.

లక్ష్మి చెల్లెలి దగ్గరికి పోయి, 'నీకు డబ్బు కావలిస్తే-నన్ను అడగకూడదా? ఈ భాగ్యానికి మొగవాళ్ళదాకా పోవాలా?' అంటుంది.

'ఏం పోతే? ఇందులో రహస్యం ఏముంది? నా మొగుణ్ణి నేను డబ్బు అడగడం తప్పా?' అంటుంది సరోజ.

లక్ష్మి అర్థం చేసుకుంది. తాళాలు యిచ్చేద్దా మన్నంత వరకూ వస్తుంది.

గాని మళ్ళీ తమాయించుకుని-ఆ రాత్రి భర్తకి జరిగిందంతా చెబుతుంది.

మరునాడు అన్న తమ్ముడికి జరిగింది చెబుతాడు.

సరోజది ఖర్చుచేసే చెయ్యి. పైగా పల్లెటూళ్ళో తోచదు. కొన్నాళ్ళపాటు తమ్ముడు మరదలితో-శృంగార యాత్ర చేసి వస్తే బాగుంటుందని సలహా యిస్తాడు.

బాగానే ఉందని రాజాగూడ ఒప్పుకుంటాడు.

రాజా సరోజల శృంగారయాత్ర ప్రారంభమైంది.

మహాబలిపురంలో మొదలుపెట్టి-ఊటీ, బృందావన గార్డెన్సూ మొదలైన దక్షిణాది టూరిస్టు కేంద్రాలు సందర్శించి, ఉత్తరాది యాత్రలకు బయలుదేరుతూ, ఢిల్లీలో అశోక హోటలుకు 5000 రూపాయలు పంపమని అన్నకు టెలిగ్రాం యిచ్చాడు. దంపతులు ఢిల్లీ చేరేసరికి టి. టి. సిద్ధంగా ఉంది. డబ్బు పుచ్చుకుని ఢిల్లీలో ఎర్రకోట, ఆగ్రాలో టాజ్ మహాలూ మొదలైన పాత ప్రదేశాలు, భాక్రానంగల్ డాములూ, చండీఘర్ రాజభవన్ మొదలైన ఆధునిక కట్టడాలూ సందర్శించి—(ప్రొడ్యూసరు యింత డబ్బు ఖర్చు పెట్టలేకపోతే, కొన్ని మానుకోవచ్చు) కాశ్మీరు చేరుకున్నారు.

కాశ్మీరులో ఒక బోటు అద్దెకు తీసుకుని, ద్వంద్వ గీతాలు పాడు

కుంటూ, మూడు మాసాలు మూడు రోజుల్లాగ వెళ్లబుచ్చారు. ఇంటికి ఉత్తరాలు రాస్తూనే ఉన్నారు—డబ్బుకోసం! నాలుగోసారిగా డబ్బు పంపుతూ, అన్న 'మరదలుపిల్ల చెయ్యి కొంచెం ఎత్తుబారి దనీ, ఖర్చు విషయంలో అదుపుచేస్తే బాగుంటుం' దని తమ్ముణ్ణి మందలించాడు.

ఆ ఉత్తరం సరోజ చదివి మండిపోయింది. అక్కకి ఉత్తరం రాస్తూ—బావగారి విషయం ప్రస్తావించి—'మేం మా డబ్బు ఖర్చుపెట్టుకుంటున్నాం. మాకు పంపిన డబ్బంతా మా పేరనే ఖర్చురాసి, మా వాటలోతీసుకోవచ్చు' నని 'యిలాంటి చిన్నవిషయాలలో—పొదుపు ఉద్యమం మీద బావగారు ఉపదేశించడం బాగాలే' దనీ ఎత్తిపొడిచింది.

లక్ష్మి ఉత్తరం భర్తకి చూపి. 'మీ కెందుకు వాళ్ల గొడవలు! ఊరుకోగూడదా!' అని సలహా యిచ్చింది. అంజి భార్యసలహా పాటించలేదు. తమ్ముడికి ఉత్తరం రాశాడు—'మరదలుపిల్ల చాటుగా నీకు రాసిన ఉత్తరాలు చదువుతున్న' దనీ, 'ఒకరి ఉత్తరాలు ఒకరు చదవడం మంచిది గా' దని, 'భార్యకు అంత చనువివ్వడం బాగలే'దనీ, హెచ్చరించాడు. సరోజ ఆ ఉత్తరంగూడ చదివి, అక్కకి యిలా రాసింది. 'తమ భార్యాభర్తల మధ్య రహస్యాలేమీ లేవనీ, తమ శరీరాలు వేరైనా, ఆత్మలు ఒకటే ననీ, ఒకరి

హృదయాలు ఒకరికి విప్పిన పుస్తకాలనీ, యీ ప్రపంచంలో ఏ అభివృద్ధి నిరోధకశక్తి తమని విడదీయలేదనీ.'— ఈ ధోరణిలో నడచింది ఉత్తరం!

అంజి మరదలి ఆవేశాన్ని గ్రహించాడు. తమ్ముడికి ఒక్క ముక్కలో ఉత్తరం రాశాడు. 'ఇకనుంచి డబ్బు పంపడానికి వీలులేదు' అని. సరోజ ఉత్తరం చదివి, భర్తచేతి కిచ్చింది. 'ఇక్కడ అప్పులు తీర్చి, ఇంటికి పోవడానికి డబ్బు లేదు' అన్నాడు భర్త. (రాజా హృదయమైతే విప్పాడు గాని—భార్య ముందు మనీపర్సు విప్పలేదు) సరోజ చాలా ఆందోళన పడింది. ఈ లోపల—'నాట్యభారతి' డ్యాన్సు ట్రూపుతో—ప్రభాకర్ కాశ్మీర్ వచ్చాడు. అతని దగ్గర చేబదులు తీసుకు ఇద్దరూ యింటికి ప్రయాణమైనారు.

విశ్రాంతి

గంటయ్య తోటబంగళాలో రామచంద్రయ్యకు తోడుగా, ఆయన్ని వినోదపరుస్తూ ఉండిపోయాడు. ఫ్రీగా దొరికిన అవుపాలూ, కోడిగుడ్లతో కొంచెం ఒళ్ళుకూడా చేశాడు.

గంటయ్య పెట్టిన చిచ్చు రగిలి మండుతున్నదని అతనికి తెలియదు.

రాజా సరోజలు ఇంటి కొచ్చేశారు.

చిన్న చిన్న విషయాల దగ్గరనుంచి అక్కచెల్లెళ్ళ మధ్య—నువ్వా—నేనా అని తగాదాలు పెరిగిపోతున్నయ్.

లక్ష్మికి విసుగెత్తి తాళాలు భర్త కిస్తుంది. భర్త తనకూ అక్కరలేదని — నీ కిచ్చిన వాళ్ళకే యిచ్చుకో' అంటాడు.

లక్ష్మి మామగారి దగ్గరికి పోయి, విషయమంతా చెప్పి, తను యీ బాధ్యత నిర్వహించలేనని తాళం చెవులు యివ్వబోతుంది. రామభద్రయ్య తీసుకోడు. తను లక్ష్మిని ఎంతో సమర్థత గలదని ఊహించి యీ యింటి కోడలుగా తెచ్చుకున్నాననీ, తన ఊహాలిలా తల్లక్రిందులవడం నమ్మలేకుండా ఉన్నాననీ, ఏమైనా యీ సంసార పంకంలో తాను మళ్ళీ ఇరుక్కోదల్చుకోలేననీ, లక్ష్మినే యింకో సారి ప్రయత్నించి చూడ'మనీ, రామభద్రయ్య బ్రతిమాలతాడు. లక్ష్మి సరేనంటుంది.

లక్ష్మి ఇంటికొచ్చేసరికి, ఇనప్పెట్టె తాళంమీద ఇంకో తాళం పడివుంది. రాజా సరోజనిని గట్టిగా మందలించబోతాడు. సరోజ నిరాహార వ్రతం ప్రారంభిస్తుంది.

పరిస్థితులు చూచి, అన్నదమ్ములు వేర్లు పడడమే మంచిదని నిర్ణయించుకుంటారు.

పంపకాలు జరుగుతయ్. వేరు వంటలు ప్రారంభమవుతయ్!

గంటయ్యకి మళ్ళీ చేతినిండా పని దొరుకుతుంది. రామభద్రయ్య సేవ వదిలి, రాజా భాగం వ్యవసాయం చేయించడం మొదలుపెడతాడు. గట్ల దగ్గర పాలేళ్ళతో ప్రారంభమైన తగవులు, పైదాకా పాకినై. ఊళ్ళో న్యాయం పెద్దవాడి తరఫునే ఉన్నదనీ, గంటయ్యే కలహాలు పెంచుతున్నాడనీ చెప్పుకుంటారు

రాజా యిప్పుడు తలకిందనే పిస్తోలు పెట్టుకుని పండుకుంటున్నాడు, రాత్రి నిద్రలో — 'అన్నో తనో — ఎవరో ఒకరు ఎగిరిపోవలసిందే ననీ, లేకపోతే ఈ తగవు చల్లార' దని ఒకటి రెండు సార్లు కలవరించాడు. సరోజ విని భయపడింది. పిస్తోలు తీసి దాచింది. రాజా బలవంతాన మళ్ళీ లాక్కున్నాడు.

అంజి ఊళ్ళో లేడు, చెబుదామంటే! గ్రామాంతరం వెళ్ళాడు. రెండు మూడు రోజుల్లో వస్తాడు.

వచ్చేదోవలో కాపలా వేసి, కాలుస్తానని రాజా సరోజతో చెప్పాడు. సరోజ భయపడింది. వెళ్ళి అక్కకు చెప్పి ఏడుస్తుంది. బావని కనబడకుండా చెయ్యమనీ, రామభద్రయ్యగారితో చెప్పి, ఈ తగాలు ఎలాగైనా సర్దుబాటు చెయ్యమనీ బ్రతిమాలుతుంది.

ఇద్దరూ రామభద్రయ్యగారి దగ్గరకు వెళతారు.

రామభద్రయ్య అంతా వింటాడు.

విని— 'ఏనాడు భాగాలు పంచుకున్నారో, ఆనాటినుంచి వాళ్ళు తన కొడుకులే కాదనీ, వాళ్ళు ఏమై పోయినా తనకు విచారం లేదని చెబుతాడు. సరోజ తప్పు తనదే నని ఒప్పుకుని, ఎట్లాగైనా యీ ప్రమాదం నుంచి తప్పించమని, కాళ్ళా వేళ్ళా పడుతుంది రామభద్రయ్య వినడు.

'మీరే తెచ్చారు తగవులు. మీరే సమర్థించుకోండి' అని చెబుతాడు. వెళ్ళి తలుపు వేసుకుంటాడు.

ఇక క్లయిమాక్సు ఘట్టం !

సరోజ ఎంత చెప్పినా వినకుండ రాజా — Standard Triumph లో — 65 మైళ్ళ స్పీడ్‌లో బయలుదేరుతాడు. వెంటబడి రాజాని ఆపడానికి — అక్కడ పల్లెల్లోకి కారు లేదు. గుర్రబ్బండి చేసుకుంటారు. గుర్రం కదలదు. సరోజ బండివాణ్ణి దిగమని అగాయిదు పట్టుకుంటుంది. (ఈ మార్పు పాఠకులకు ఎబ్బెట్టుగా ఉంటుంది గాని— ప్రేక్షకులకు బాగుంటుంది) గుర్రం గూడ 59 మైళ్ళ స్పీడులో పోతూ ఉంటుంది

రాజా కారు దూసుకుపోతూ ఉంది! గుర్రబ్బండి ఆగ మేఘాలమీద పోతో ఉంది. సరోజ—కొరడా.... దెబ్బ !. కొరడా.... దెబ్బ !....

గుర్రబ్బండి కారుని దాటగలదా ? ప్రేక్షకులు గుండె చేతబట్టుకుని, Background music వింటూ కూర్చుంటారు. కారు పోతూనే ఉంటుంది 60, 70, 80 మైళ్ళ Speed !



గుర్రం 59, 49. 39—దిగుతూ ఉంది!

లాభంలేదు! ఈ ప్రమాదాన్ని నివారించే వీలులేదు! దైవయత్నం తప్పితే. మానవ ప్రయత్నం లాభంలేదని ప్రేక్షకులు నిర్ణయించుకుంటారు.

కారు పోతూనే వుంటుంది— ఇంకా పోతుంది.—గుర్రం నురుగులు కక్కుతోంది! ఏమిటా నురుగుల్లో ఎరుపు! ఎరుపు గాదు రక్తం!

అక్కచెల్లెళ్ళిద్దరూ - దిగి - పరుగులకించుకున్నారు. ప్రేక్షకులు, చూడలేక, కళ్ళు మూసుకున్నారు.

Background music వినబడుతూనే ఉంది.

70 మైళ్ళ స్పీడులోపోయే కారును యీ అబలామణులు జయించగలరా?

అని ప్రేక్షకుల ముఖంలో ఒకటే ప్రశ్న పెద్ద ప్రశ్న!! తెరంతా ప్రశ్న!!!

ఢాం! పెద్ద చప్పుడు! ప్రేక్షకులు కళ్ళు తెఱిచారు! టైరు బరస్టు అయింది. రాజా దిగాడు. జాకీ తీశాడు. టైర్ మార్చాలి.

అబలలు పరుగెడుతున్నారు. దూరం దగ్గరవుతున్నది. చూపు మేరలో కారు కనిపించింది. ధర్మం జయించింది.

ఇంకో ఉపద్రవం! అంజి కారు ఎదురుగా వస్తున్నది! పాపం, అంజికి యిదంతా తెలియదు.

అబలలు దగ్గరికి వచ్చేస్తున్నారు. అంజి కారు వచ్చి ఆగింది. తమ్ముడూ! టైర్ వెయ్యాలా అని ఆప్యాయంగా దగ్గర కొచ్చాడు.

ఆడవాళ్ళు 'వద్దు! వద్దు!! చంపేస్తాడు' అని అంజికి అడ్డం పోతారు. అంజికి ఏమీ అర్థం కాదు. Background music రొదలో — నిజానికి — యీ మాటలు వినపడవు. రాజా పిస్తోలు తీస్తాడు! అంజి గ్రహించుకుంటాడు!! 'రొమ్మిచ్చి తమ్ముడు చేతిలో చావడం కంటే స్వర్గమే లేదని, యీ బలితోనైనా కుటుంబకలహాలు తీరితే, తాను సంతోషిస్తా'నని — అంటాడు.

సరోజ అంజికి అడ్డంగా పోతుంది. 'ముందు నన్ను కాల్చి, తరువాత బావని కాల్చ'మంటుంది.

రాజా 'లాభంలే' దంటాడు. 'నీ సౌఖ్యం కోసం నే నింత చేస్తే — నువ్వు పోయిం తరువాత — నా కిక ప్రపంచం ఏముంటుంది? సన్యసిస్తా'నని పిస్టలు పారేస్తాడు.

సరోజ నిజంగా పశ్చాత్తాప పడుతుంది. తన మూలంగాగదా, గుట్టుగా బతికిన కుటుంబం రట్టు అయిందని — చిన్న Speech యిస్తుంది, (ఆ Speech వ్రాయడం లేదు — ఎవరైనా సినిమాల్లో పెట్టుకుంటారేమో నని).

Speech యిచ్చి — పిస్టలు తీసుకొని కాల్చుకుంటుంది.

లక్ష్మి కెవ్వున కేక వేసి, చేతుల్లోకి తీసుకొని, ఏడుస్తుంది. (ఏడుపులో చిన్నపిల్లలా గుక్క పెడుతుంది.) రాజా వదినెను ఓదారుస్తాడు! ఫరవా

లేదు. అంత ప్రమాదకరమైన దెబ్బ కాదని మొదలుపెట్టి, చివరికి 'పిస్తోలులో గుండు లే' దని తేల్చి పారేస్తాడు. సరోజ ఆశ్చర్యంతో కళ్ళు తెరుస్తుంది.

అందరూ కలిసి టైర్ తగిలిస్తారు.

అంతా కారెక్కి quartet పాడుకుంటూ — ఇల్లు చేరుకుంటారు.

విచిత్రం! యిల్లు తాళం వేసివుంది.

ఈ సంతోషవార్త తెలిపి, తాళం చెవి తెచ్చుకోవడానికి నలుగురూ రామభద్రయ్య దగ్గరికి పోతారు.

రామభద్రయ్య ముఖాన—కొడుకులు కోడళ్ళు కలసి వచ్చినందుకు సంతోష చిహ్నాలు కనబడలేదు; విసుగు మాత్రమే ద్యోతక మవుతున్నది.

కొడుకులు కోడళ్లను ఆశీర్వదించడానికి బదులు — యిలా ఆదేశించారు.

"—తండ్రి సంపాదించిన ఆస్తి తింటూ కూర్చుంటే — మీకు డబ్బు విలువ తెలియ లేదు, కొట్లాడుకున్నారు. ఈ నాటినుంచీ—నా ఆస్తిలో మీకు భాగం లేదు. చెరి వెయ్యి రూపాయలు యిస్తున్నాను—ఖర్చులకి. వెళ్ళి సంపాదించుకొని బతకండి."

డబ్బు చేతికిచ్చి, 'శుభం' అని చెప్పి పేపరు ముఖానికి అడ్డుపెట్టుకున్నాడు

పేపరు మీద 'శుభం' అనే అక్షరాలు — పెద్దవిగా కనిపిస్తాయ్:— తెరనిండా!.